
సాక్షి
బాపట్ల
గురువారం | 9 | మార్చి | 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.3747 టీఎంసీలు. ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.8,600, మోడల్ ధర రూ.7,300 వరకు పలికింది.



అమరేశ్వరుని సేవలో జడ్జి

అమరావతి : అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

తిరునాళ్ల ఆదాయం రూ.34.21 లక్షలు



అద్దంకి: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి తిరునాళ్ల ద్వారా రూ.34.21 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఏసీ సుభద్ర తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా హుండీతో పాటు వివిధ రకాల సేవలు, టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఇందులో ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా రూ.7,60,250, ఆకుపూజ ద్వారా రూ.56 వేలు, కేశఖండన రూ.23,200, వాహన పూజ రూ.13,450, లడ్డూ ప్రసాదం రూ.3,33,270. పులిహోర ప్రసాదం రూ.71,980. సింధూరం అమ్మకం రూ.31,240, అన్నదాన విరాళాలు రూ.76,278, హుండీ నుంచి రూ.20,55,387 లభించినట్లు ఏసీ వెల్లడించారు. మొత్తం రూ.34,21,055 వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం తిరునాళ్లకు రూ.37,74,715 రాగా, ఈ సంవత్సరం 6,53,650 తగ్గినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, ప్రత్యేక అధికారులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ డిజిటల్ చానళ్లు ప్రారంభం

నెహ్రూనగర్(గుంటూరు): ఉల్కా టీవీ పేరుతో బీఎస్ఎన్ఎల్ డిజిటల్ టెలివిజన్ చానళ్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిని గురువారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందని ఆ సంస్థ ఎండీ సప్పరపు శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ వినియోగదారులు సెట్‌ఆప్ బాక్స్ లేకుండా ఆండ్రాయిడ్ టీవీ, మొబైల్ ద్వారా 300కు పైగా టీవీ చానళ్లను ఉచితంగా జూన్ వరకు వీక్షించవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ సేవలు కావాలనుకునే వారు వాట్సాప్ నంబరు 73824 86677కు మీ ఊరి పేరు, మండలం, పేరు పంపాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 542.00 అడుగుల వద్ద ఉంది. ఇది 192.5190 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,900, ఎడమ కాలువకు 9,257, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 21,677 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 21,677 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 821.70 అడుగుల వద్ద ఉంది. ఇది 42.0842 టీఎంసీలకు సమానం.

అభినయం.. ముగ్ధమనోహరం



కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళావేదికపై జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారం మనోహరంగా ముగిశాయి. రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొన్ని వీటిని ఏర్పాటు చేశారు. కూచిపూడి నృత్యాంశాలు, కథక్, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్ఐ డి.సందీప్, కళారత్న వేదాంతం రాధేశ్యాం, నాట్యాచార్యులు జగన్మోహనరావు, భానుమూర్తి, మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన రాధికా బృందం, నెల్లూరు బృందం, బాలా త్రిపురసుందరి శిష్య బృందం, నందిగామకు చెందిన డి. జాహ్నవి, కావలికి చెందిన శ్రీరంగ కూచిపూడి ఆర్ట్ అకాడమీ, గుంటూరు శ్రీరుద్ర కళాక్షేత్రం బృందాలు తమ ప్రతిభను కనబరిచారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు నాట్యాచార్యులను, కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

శనగల కొనుగోలుకు సర్వం సిద్ధం

జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వారం రోజుల్లో కొనుగోలు ప్రారంభం
- 16 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు అర్హులు
- జిల్లాలో రబీ శనగ సాగు 24,457 హెక్టార్లు



శనగ పంటను కోస్తున్న రైతు కూలీలు



శనగ పంటను మిషన్‌లో వేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్నదాతలను అన్నిరకాలుగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రబీలో రైతులు పండించిన శనగలు కొనుగోలుకు సిద్ధమైంది. ఈ మేరకు మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఏపీ మార్క్‌ఫెడ్ శనగల కొనుగోలుకు సర్వం సిద్ధం చేసింది. ఇందుకోసం జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి శనగలు కొనుగోలు చేయనున్నారు. వారం రోజుల్లో శనగల కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 24,457 హెక్టార్లలో రైతులు శనగ పంటను సాగు చేశారు. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో శనగ పంటను అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట కోత దశలో ఉంది. దీంతో గిట్టుబాటు ధరతో శనగలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తక్షణమే పంట కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మార్క్‌ఫెడ్ జిల్లాలోని అద్దంకి, బల్లికురవ, చినగంజాం, ఇంకొల్లు, జే-పంగులూరు, కారంచేడు, కొరిశపాడు, మార్టూరు, పర్చూరు, సంతమాగులూరు, యద్దనపూడి మండలాల పరిధిలో ఇప్పటికే 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇంకొల్లు, కారంచేడు, కొరిశపాడు, పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో మరో 7 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ సిద్ధమైంది. ఆయా మండలాల పరిధిలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా శనగల కొనుగోళ్లు చేపట్టనున్నారు. మొత్తం 16 వేల మెట్రిక్ టన్నుల శనగలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వారం రోజుల్లోనే శనగల కొనుగోళ్లు మొదలు కానున్నాయి. క్వింటాల్‌కు రూ.5,335 ధర చెల్లించనున్నారు.

కొనుగోలు నిబంధనలు ఇలా..

ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు శనగ పంటను అమ్ముకునేందుకు అర్హులు. వీరు గ్రామంలోని అగ్రికల్చరల్ అసిస్టెంట్ ద్వారా శనగ పంట అమ్మకానికి సంబంధించి పేర్లు నమోదు చేయించుకోవాలి. అధికారులు కేటాయించిన తేదీల ప్రకారం రైతులు పీఏసీఎస్‌లకు పంటను తీసుకెళ్లి అమ్ముకోవాల్సి ఉంటుంది.

కర్షకులకు అండగా ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది. రైతులు పండించిన పంటలకు ఎప్పటికప్పుడు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోంది. తాజాగా రబీలో రైతులు పండించిన శనగలను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ సీజన్‌లో 16 వేల మెట్రిక్ టన్నుల శనగలను కొనుగోలు చేయనున్నాం.

– షేక్ అబ్దుల్ సత్తార్, జేడీఏ

శనగ రైతులు హర్షం

ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాలుగా రైతులకు సహాయసహకారాలు అందిస్తున్న ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు రైతుల కడుపుకొడుతున్న దళారీ వ్యవస్థకు చెక్ పెట్టింది. ప్రతి సీజన్‌లో ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నతో 'చేనేత'కు పునరుజ్జీవం

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



ఇసుకపల్లి చేనేత సహకార కార్యాలయంలో మగ్గాలను పరిశీలిస్తున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి

రేపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషితో చేనేతరంగం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. ఇసుకపల్లి, రేపల్లె చేనేత సహకార సంఘాలను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. చేనేత కళాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకే ఆప్కో ఆవిర్భవించిందన్నారు. నేతన్నలు తయారు చేస్తున్న వస్త్ర ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, తద్వారా కార్మికులకు నిరంతర ఉపాధి చూపించడంతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు అందించడమే ఆప్కో ఉద్దేశమన్నారు. స్వాతంత్య్రం సిద్ధించక మునుపు నుంచి నడుస్తున్న ఇసుకపల్లి, భట్టిప్రోలు మండలంలోని ఐలవరం వంటి సొసైటీలను రాష్ట్ర వ్యాప్తంగా అనేకం ఉన్నాయని, వాటన్నింటినీ మరింతగా అభివృద్ధి పరిచేందుకు ఆప్కో తరఫున తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. చేనేతపై ఆధారపడిన కార్మిక కుటుంబాల అభ్యున్నతికి, సహకార సంఘాల బలోపేతానికి, ఆప్కో పరిపుష్టికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంపై ఎంతో ముందుచూపు ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన ఆలోచనలతో అణగారిన వర్గాలకు అండగా నిలుస్తున్నారని, చేనేత సాధక బాధకాలపై సమగ్రమైన అవగాహన కలిగిన సీఎం జగన్ నేతన్న నేస్తం ద్వారా చేనేతల కుటుంబాల్లో వెలుగులు నింపారని చెప్పారు. ఈ నెల 17వ తేదీ మంగళగిరిలో చేనేత సహకార సంఘాల జనరల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు ఎనిమిది సంవత్సరాల తరువాత జరుగుతున్న సమావేశానికి సహకార సంఘాల ప్రతినిధులు హాజరై తమ సమస్యలు, సలహాలు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘాల్లో చేనేత కార్మికులు నేస్తున్న వస్త్ర ఉత్పత్తులను పరిశీలించి నేత కార్మికుల కళానైపుణ్యాన్ని అభినందించారు. చీరలు, డ్రెస్ మెటీరియల్స్, దుప్పట్లు, షర్టింగ్ క్లాత్, లుంగీలు, పంచెలు, టవళ్లు, దుప్పట్ల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, సొసైటీ అధ్యక్షుడు కొతరపు వెంకట నాంచారరావు, మేనేజర్ శోభన్‌బాబు, రేపల్లె చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్స్ గుర్రం వెంకటేశ్వరరావు, జూనం గోవిందరావు, సాధు శ్రీనివాసరావు, ఆకురాతి సుబ్బారావు, కోర్నిపాటి శివకోటేశ్వరి పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరు): దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలుచోట్ల రైల్వే పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం బుధవారం వెల్లడించారు. రైలు నంబర్ 07091 ఖాజీపేట-తిరుపతి, 07092 తిరుపతి-ఖాజీపేట రైలును ఈ నెల 14వ తేదీ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 07185 మచిలీపట్నం-సికింద్రాబాద్, 07816 సికింద్రాబాద్-మచిలీపట్నం రైలును ఈ నెల 12వ తేదీ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. 07755 డోర్నకల్-విజయవాడ, 07756 విజయవాడ-డోర్నకల్, 07464 విజయవాడ-గుంటూరు, 07465 గుంటూరు-విజయవాడ, 07979 విజయవాడ-భద్రాచలంరోడ్డు, 07278 భద్రాచలంరోడ్డు-విజయవాడ రైళ్లను ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

తాత్కాలిక రద్దు..

ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు 17201 గుంటూరు-సికింద్రాబాద్ రైలును (ఖాజీపేట-గుంటూరు మీదుగా) తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని తెలిపారు. 17202 సికింద్రాబాద్-గుంటూరు రైలును, 12705 గుంటూరు-సికింద్రాబాద్ రైలు (ఖమ్మం-గుంటూరు), 12706 నంబరు రైలు గుంటూరు-ఖమ్మం మీదుగా తాత్కాలికంగా రద్దయినట్లు పేర్కొన్నారు. రైల్వే ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా తెలియజేశారు.

రైతు ఇంట.. సిరుల పంట

- ధాన్యం కొనుగోలు చేసిన వారం వ్యవధిలోనే నగదు జమ చేస్తున్న ప్రభుత్వం
- ఇప్పటివరకు 68,340 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.129.21 కోట్లు జమ
- రవాణా కింద రూ.1.61 కోట్లు అందజేత
- హమాలీ ఖర్చులకు రూ.91.48 లక్షలు జమ
- ప్రభుత్వ విధానాలపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



– బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల సుబ్బారావు తాను పండించిన ధాన్యాన్ని గ్రామంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా ఫిబ్రవరి 20న విక్రయించారు. అతనికి ట్రక్‌షీట్ జనరేట్ చేసిన తర్వాత ధాన్యాన్ని అమర్తలూరులోని శ్రీవేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌కు చేర్చాలని ఆర్‌బీకే సిబ్బంది సూచించారు. 53 క్వింటాళ్ల ధాన్యాన్ని అదే మిల్లుకు తరలించారు. ధాన్యం మిల్లుకు తోలిన మూడు రోజుల వ్యవధిలోనే ఫిబ్రవరి 23న ధాన్యం తాలూకా రూ.2,20,420 నగదు, రవాణా ఖర్చుల కింద రూ.2,750 చొప్పున మొత్తం రూ.2,23,170 రైతు అకౌంట్‌లో జమ అయ్యాయి. దీంతో ఆ రైతు ప్రభుత్వ తీరుపై హర్షం వ్యక్తం చేశారు.



– బాపట్ల మండలం పిన్నిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన మద్దిబోయిన రామకృష్ణకు మూడు ఎకరాల పొలంలో 96 బస్తాల దిగుబడి వచ్చింది. వీటిని పిన్నిబోయినవారిపాలెం రైతు భరోసా కేంద్రం ద్వారా విక్రయించారు. ట్రక్‌షీట్ జనరేట్ చేసిన తర్వాత బాపట్ల పట్టణంలోని వెంకట నాగసాయి రైస్ ట్రేడర్స్‌కు ధాన్యం తరలించాలని ఆర్‌బీకే సిబ్బంది సూచించారు. ఫిబ్రవరి 17న ధాన్యాన్ని మిల్లుకు తోలారు. ఫిబ్రవరి 22న తన అకౌంట్‌లో ధాన్యం తాలూకా రూ.1,47,840, రవాణా ఖర్చుల కింద రూ.1630 మొత్తం రూ.1,49,470 నగదు జమ చేశారు. గతంలో దళారులు ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు గడిచినా నగదు చెల్లించేవారు కాదని, ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన వారం వ్యవధిలోనే నగదు జమ చేస్తుండటం సంతోషంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు.



రైస్‌మిల్లు వద్దకు చేరుకున్న ధాన్యం ట్రాక్టర్లు



రైస్‌మిల్లు వద్ద నిండుకుండలా దర్శనమిస్తున్న ధాన్యం బస్తాలు

బాపట్లటౌన్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించారు. దళారీ వ్యవస్థను పూర్తిస్థాయిలో నివారించారు.

గిట్టుబాటు ధరలకు ధాన్యం కొనుగోలు

రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను పెంచింది. గతంలో సాధారణ రకం క్వింటాల్ ధర రూ.1940 ఉండగా ప్రస్తుతం రూ.2040 చేసింది. ఏ గ్రేడ్ రకం గతంలో రూ.1960 ఉండగా ప్రస్తుతం రూ.2060కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు అవసరమైన సంచులను ప్రభుత్వమే సమకూరుస్తోంది.

ఇటు కొనుగోళ్లు.. అటు నగదు జమ

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం జోరుగా కొనుగోలు చేస్తోంది. జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 25 మండలాలు ఉండగా వాటి పరిధిలో 153 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా మొత్తం 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతం 18 మండలాల పరిధిలో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం 9,482 మంది రైతుల నుంచి 68,340 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం తాలూకా రైతులకు ఇప్పటికే రూ.129.21 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన వారం వ్యవధిలోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నారు. వీటితో పాటు సాధ్యమైనంత వరకు గోతాలను ప్రభుత్వమే అందిస్తోంది. అందుబాటులో ఉన్న 260 మంది రైతులు గోతాలు తెచ్చుకున్నందుకు వారికి గానూ రూ.1,67,388 జమ చేసింది. ధాన్యం తరలించినందుకు రవాణా ఖర్చుల కింద 6200 మంది రైతులకు రూ.1,60,97,464 నగదు జమచేసింది. రైతులు తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లులో దించినందుకు ముఠా కూలీల ఖర్చులకు గానూ 5743 మంది రైతులకు రూ.91,48,620 నగదును ప్రభుత్వం ఇప్పటికే అందజేసింది.

దళారీ వ్యవస్థకు చెక్

గత ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు దళారుల అక్రమాల పుణ్యమా అని అష్టకష్టాలు తప్పేవి కావు. దళారులు, మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి వారికి నచ్చిన రేట్లను నిర్ణయించి రైతులను నిలువుదోపిడీ చేసేవారు. రైతుల కష్టాలను తన పాదయాత్రలో స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర నేరుగా రైతు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు చేపట్టి దళారీ వ్యవస్థకు చెక్ పెట్టారు. దీంతో రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల వ్యవధిలోనే నగదు జమ



ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే నిధులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే రూ.129.21 కోట్లు నిధులు రైతుల అకౌంట్‌లలో జమ చేయడం జరిగింది. వీటితో పాటు రైతులకు హమాలీ చార్జీలు, గోతాల ఖర్చును కూడా ప్రభుత్వమే అందిస్తోంది. వారానికి ఒక రోజు వారం రోజుల వ్యవధిలో ధాన్యం తోలిన ప్రతి రైతుకు నగదును జమ చేస్తున్నాం.

– వి.శ్రీలక్ష్మి, మేనేజర్, జిల్లా పౌర సరఫరాల శాఖ

వైభవంగా శ్రీవారి వసంతోత్సవం



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు


మంగళగిరి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ, కేళి గుర్రంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు దొంగల దోపిడీ కార్యక్రమం నిర్వహించారు. చూర్ణోత్సవం, వసంతోత్సవం జరుపుకుంటూ పురవీధుల్లో విహరించిన స్వామికి కోనేరు వద్ద చక్రస్నానం చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామివారు కేళి గుర్రంపై పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలకు కైంకర్యపరులుగా నిడమర్రుకు చెందిన కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, ఛాయాదేవి దంపతులు వ్యవహరించగా, రాత్రి ఉత్సవానికి బెంగళూరుకు చెందిన బుల్లా రుక్మిణీరావు, దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు వ్యవహరించారు.

14న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యా సంస్థల్లో నులి పురుగు నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డీఈవో పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలతో పాటు కిశోర బాలలందరికీ ఈ నెల 14న ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను అన్ని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి నులి పురుగుల నివారణ మాత్రలను తీసుకునే విధంగా చూడాలని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలతో పాటు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. ఆ రోజున ఎవరైనా అందుబాటులో లేకుంటే అటువంటి పిల్లలను ఈ నెల 18న జరిగే మాప్ అప్ కార్యక్రమంలో మాత్రలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏదైనా అత్యవసర వైద్య సహాయానికి 104 నంబరుకు కాల్ చేయాలని తెలిపారు.

అన్నిరంగాల్లో అతివలకే అగ్రాసనం

- సమాన హక్కుల దిశగా సమాజం
- మహిళా పక్షపాత, సాధికారత ప్రభుత్వం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని, స్త్రీ, పురుష పక్షపాతం లేని సమాన హక్కుల దిశగా సమాజం అడుగులు వేసేలా ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వేడుకలకు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అగ్రాసనమేస్తోందని, పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజకీయంగా వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మండల స్థాయి తొమ్మిది పదవుల్లో 8 పదవుల్లో మహిళలే ఉన్నారని, పురుషులతో సమానంగా వారు రాణించడం అభినందనీయమన్నారు. పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీత హసంతి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి మహిళా సాధికారత దిశగా విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ షకీలా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీతత్వం దేవుడిచ్చిన వరమని, మనం ఏ స్థాయికి ఎదిగినా దాన్ని విస్మరించకూడదన్నారు. యువ న్యాయవాది నయన మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహిళా ప్రజాప్రతినిధులను, మహిళలను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, ఎంపీపీలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, తేలుకుట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజ్‌పై దారుణం

- హోటల్‌లో పనిచేసేవారిని చితకబాదిన ఆగంతకులు
- భయంతో పరుగులు తీసినా వదలని వైనం


చికిత్స పొందుతున్న సుందరం సుకుమార్


మోహన్

తాడేపల్లి రూరల్: కృష్ణానది ప్రకాశం బ్యారేజ్‌పై బుధవారం తెల్లవారుజామున బ్యారేజ్ ఫుట్ రెస్ట్‌పై విశ్రాంతి తీసుకుంటున్న హోటల్‌లో పనిచేసే ఇద్దరిపై గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి కర్రలతో దాడిచేసి గాయపరిచిన ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తమిళనాడు నుంచి విజయవాడ వచ్చి ఇక్కడ ఉన్న హోటళ్లలో పనిచేయడంతో పాటు క్యాటరింగ్ పనులు చేసుకుని జీవిస్తున్న సుందరం సుకుమార్, మోహన్ ప్రకాశం బ్యారేజ్ 15వ గేటు వద్ద ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్నారు.

తెల్లవారుజామున ఆకుపచ్చని ఆటోలో గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు వచ్చి పడుకుని ఉన్న 50 మందిలో వీరిద్దరినే వెతికి అక్కడే చితకబాదారు. పారిపోతున్న సుకుమార్‌ను, మోహన్‌ను 25వ గేటు వరకు తరిమి తరిమి కర్రలతో చితకబాదారు. బ్యారేజ్ మీద వస్తున్న వాహనాలను ఆపి వారిద్దరు రక్షించమని వేడుకున్నారు. ద్విచక్ర వాహనాలు గొడవ జరుగుతున్న ప్రాంతంలో ఆగడంతో ఆటోలో వచ్చిన ఐదుగురు అక్కడి నుంచి పరారయ్యారు. తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన ఇద్దరినీ వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల నిఘా..

ప్రకాశం బ్యారేజ్‌పై వందలాది మంది కేటరింగ్ చేసేవారు, హోటళ్లలో పనిచేసేవారు, యాచకులు నిద్రిస్తుండగా వీరిద్దరినే వెతికి దాడిచేయడంపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. బహుశా ఎప్పటి నుంచో ఇక్కడే నివాసముంటున్న సుకుమార్, మోహన్‌లు ఏమైనా పాతకక్షలు ఉన్నాయా? ఇతర అంశాల ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ ఐదుగురు ఆటోలో పరారు కావడంతో విజయవాడలోని పలు సీసీ కెమెరాలను పరిశీలించేందుకు డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో మూడు టీంలను ఏర్పాటు చేశారు.

తాకట్టుకు.. డ్వాక్రా బకాయికి లింకు పెట్టిన బ్యాంక్

- వడ్డీతో సహా నగదు చెల్లించిన బాధితులు
- తాకట్టు పెట్టిన గొలుసు ఇవ్వమంటే సీజ్ పేరుతో ఇబ్బందులు

మంగళగిరి: నగరానికి చెందిన పూజిత మహిళా సంఘం సభ్యులు స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాలో డ్వాక్రా రుణం పొందారు. అనంతరం సభ్యులు బ్యాంకుకు కొంత బకాయి పడ్డారు. సభ్యులు ఒకరిద్దరు చెల్లించగా మిగిలిన వారు నగదు తిరిగి చెల్లించలేదు. ఈ క్రమంలో గ్రూపు సభ్యుల్లోని కొసనం పరిమళ అనే మహిళ తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం 20 గ్రాముల బరువైన బంగారు చైన్ రూ.60 వేలకు బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకుంది. కాగా చైన్ పొందేందుకు బ్యాంకుకు వెళ్లగా తన పేరుపై ఉన్న డ్వాక్రా పెండింగ్ రూ.40 వేలు చెల్లించాలని బ్యాంకర్లు తెలిపారు. దీంతో పెండింగ్ బకాయిని చెల్లించేందుకు సిద్ధ పడగా బ్యాంక్ అధికారులు చైన్ సీజ్ అయిందని, గ్రూపు సభ్యులందరూ చెల్లిస్తేనే మీ చైన్ తిరిగి ఇస్తామని చెప్పడంతో బాధితురాలు విస్మయ వ్యక్తం చేసింది. తమ వ్యక్తి గత రుణానికి, గ్రూపుకు లింకు పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేసింది. సీజ్ అయినప్పుడు పెండింగ్ పేరుతో తన వద్ద నగదు ఎందుకు చెల్లించుకున్నారని, చైన్‌కు సంబంధించిన వేలం నోటీసు ఎలా ఇచ్చారని ప్రశ్నించింది. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా తాము చైన్ అమ్ముకునేందుకు ప్రయత్నిస్తూ విడిపించేందుకు బయట వడ్డీకి తెచ్చామని, కనీసం తాము చెల్లించిన నగదు తిరిగి ఇప్పించాలని బాధితురాలు కోరింది. సదరు విషయమై బ్యాంక్ అధికారులను వివరణ కోరగా గ్రూపు సభ్యుల బకాయి ఉన్న కారణంగా గ్రూపు సభ్యులందరి ఎకౌంట్‌లు సీజ్ అయ్యాయని, వీటికి సంబంధించిన నోటీసులను బాధితులకు పంపినట్లు తెలిపారు.

జగనన్న పాలనలో మహిళలకే ప్రాధాన్యం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు


మహిళలతో కేక్ కట్ చేయిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని గుళ్లపల్లి ప్రధాన కూడలిలో వినాయకుని విగ్రహం వద్ద బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ రాజకీయ పరమైన ప్రాధాన్యం కల్పిస్తూ నామినేటెడ్ పదవులు 50 శతం శాతం మహిళలకే వర్తింప జేశారని వివరించారు. రాబోవు ఎన్నికల్లో శాసన సభ వంటి పదవుల్లో కూడా జగనన్న పాలనలో మహిళలకే ప్రాధాన్యం ఉంటుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు మహిళలకే కేటాయించి నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తూ మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి నిలిచారని కొనియాడారు. మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మహిళలంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. అనంతరం మహిళలతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి చెన్ను శివమ్మ, తూర్పుపాలెం సర్పంచి తూము రమాదేవి, ఎంపీటీసీలు కొడాలి నాగరాణి, కాటూరి నిర్మల, కొత్తపల్లి సుమలత పాల్గొన్నారు.

భారీ పెట్టుబడులు రాక..

చెరుకుపల్లి: ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్‌ఇన్వెస్టర్ సమ్మిట్‌తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రానున్నాయని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపల్లిలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనపై నమ్మకంతో ప్రపంచ నలుమూల నుంచి దిగ్గజ కంపెనీలు తరలివచ్చినట్లు చెప్పారు. ముఖేష్ అంబాని, అదాని, జిందాల్ వంటి గొప్ప కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చి ఎంఓయూలు చేసుకున్నారని చెప్పారు. ఒప్పందాలను కూడా ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, స్థానిక సర్పంచి చెన్ను శివమ్మ, ఎంపీటీసీ కాటూరి నిర్మల, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, బడుగు చంద్రపాల్, కాటూరి కృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఉన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

- దిశ ఇన్‌చార్జి డీఐజీ రాజకుమారి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మిని సత్కరిస్తున్న దిశ ఇన్‌చార్జి డీఐజీ రాజకుమారి తదితరులు


మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వేదికపై డాక్టర్ యాస్మిన్, డాక్టర్ ప్రభావతి తదితరులు

మంగళగిరి: సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని డీఐజీ రాజకుమారి అన్నారు. నగరంలోని రాయల్ బోంటిక్ హాల్ ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం, విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఐజీ రాజకుమారి మాట్లాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థినులు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను, దాడులను అరికట్టేందుకు దిశ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల మాట్లాడుతూ సమాజంలో మహిళలు అబల కాదు సబల అని నిరూపించుకునేందుకు ప్రతి మహిళ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు సామూహిక శ్రీమంతాలు, పేద విద్యార్థులకు ఆర్థికసాయాన్ని అందజేయడంతో పాటు పలువురు మహిళా వైద్యులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులను దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన అధ్యక్షులు కె క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, జిల్లా మహిళా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ నాగమణి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు చైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, వైసీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, నాన్‌పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరి నాయుడు, స్నేహ మహిళా మండలి అధ్యక్షురాలు వల్లభనేని వాణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో ఆధ్వర్యంలో ...

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళ ఉద్యోగినులకు వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బుధవారం ముఖ్య అతిథుల చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎన్జీవో జిల్లా మహిళ విభాగం చైర్‌పర్సన్ ఎం.రాధారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మెడికల్ అండ్ హెల్త్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఉద్యోగి నిరాశ్రయులుగా ఉన్న కొంత మంది మహిళలకు తగిన విధంగా ప్రోత్సాహం ఇవ్వాలని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ మహిళ ఉద్యోగుల్లో నేడు చైతన్యం బాగా వచ్చిందని, ప్రతి మహిళ ఉద్యోగి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి మాట్లాడుతూ మహిళ ఉద్యోగినులకు ఏపీ ఎన్జీవో నేతలు ఇస్తున్న ప్రోత్సాహకం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల పెంపకం విషయంలో ఆడ, మగ అనే వివక్ష చూపించకూడదని చెప్పారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంఘంలో మహిళలకు పెద్ద పీట వేశామని, జిల్లా, తాలూకా కమిటీల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్‌షరీఫ్, జిల్లా మహిళ సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, కె.రమ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, మహిళ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే అగ్ర తాంబూలం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము


కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రాము, నాబార్డు ఏజీఎం కార్తీక్

కొరిటెపాడు(గుంటూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని, సంక్షేమ పథకాలన్నింటిలోనూ వారికే అగ్ర తాంబూలం ఇస్తున్నారని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము అన్నారు. బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాము మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ అతివల పేరిటే మంజూరు చేశారని తెలిపారు. నాబార్డు ఏజీఎం కార్తీక్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని వెల్లడించారు.

ఐడీబీఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ ప్రత్యూష మాట్లాడుతూ కుటుంబంలో ఒక వ్యక్తి విద్యావంతుడిని చేస్తే ఆ వ్యక్తికి మాత్రమే విద్య అందుతుందని, కానీ అదే ఒక మహిళకు విద్య అందిస్తే దాని ద్వారా భావితరాలంతా విద్యావంతులు అవుతారన్నారు. గుంటూరు జిల్లా సహకారశాఖ అధికారి ఎం.వీరాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, ఉద్యోగినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. జీడీసీసీ బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపి మహిళల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడటమే ధ్యేయంగా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని అన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన మహిళా ఉద్యోగలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీబీ పాలక వర్గ సభ్యుడు కె.హరిబాబు పాల్గొన్నారు.

డీపీఓలో అట్టహాసంగా మహిళా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ కేక్‌ను కట్ చేసి పలువురు మహిళా పోలీస్ అధికారులు, ఉద్యోగులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలు రాణిస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లోనూ ముందు వరుసలో ఉంటున్నారని పేర్కొన్నారు. పురుషులకు దీటుగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రత, సంక్షేమ కోసం అనేక చట్టాలు ఉన్నాయని అన్నారు. మహిళలకు దిశ యాప్ మరింత రక్షణగా నిలుస్తోందని చెప్పారు. బందోబస్తు విధులకు హాజరయ్యే మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సౌకర్యార్థం దిశ బస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ జెస్సీ ప్రశాంతి పాల్గొన్నారు.

మహిళలతోనే మానవ మనుగడ

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి


మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: భారతీయ సంస్కృతిలో మహోన్నత స్థానం గల మహిళలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం లక్ష్మీపురంలోని మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ మహిళల విలువ తెలిసిన ముఖ్యమంత్రి కనుకనే వై.ఎస్.జగన్ వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెంపొందించే రీతిలో పరిపాలన చేస్తున్నారన్నారు. అందుకే మహిళా సాధికారత విషయంలో మన రాష్ట్రం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. మహిళలు 'అవనిలో సగం... అవకాశాల్లో సగం' అన్నది కేవలం ఒక నినాదంలా కాక ఆచరణలో అమలు చేసి చూపిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ఆ దిశగా వారికి తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వడంతో పాటు అన్ని రంగాలలో విధిగా 50 శాతానికి మించి అవకాశాలు కల్పిస్తూ ఏకంగా చట్టం చేసిన ఏకైక సీఎంగా దేశంలోనే ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయాలన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనలో భాగంగా అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, సామాజిక పింఛన్లు, వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, మహిళల పేరిట పేదలందరికీ ఇళ్లు, స్వేచ్ఛ, దిశ, మహిళా పోలీస్, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న తోడు తదితర కార్యక్రమాల ద్వారా మహిళలను ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా, వారికి భద్రత పరంగా కూడా ఒక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి రావు పాల్గొన్నారు.

మహిళా సాధికారిత సీఎం జగన్‌తోనే సాధ్యం: ఎమ్మెల్సీ డొక్కా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. తొలుత మహిళలతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు అవకాశం కల్పించటం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని భావించి వారికి సీఎం వైఎస్ జగన్ అగ్రతాంబులం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, కార్పొరేటర్‌లు, పార్టీ నేతలు షేక్ నూరిఫాతిమా, షేక్ ముంతాజ్, గనిక ఝాన్సీ, బత్తుల అనూరాధ, కానూరి నాగేశ్వరి, పిల్లి మేరీ, షేక్ షహీలానర్గీస్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీలో సెమీస్‌కు గుంటూరు

సత్తాచాటిన విశాఖ, కడప

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు గుంటూరు చేరుకోగా విశాఖ, కడప జిల్లాల జట్లు తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఏపీలోని ఉమ్మడి జిల్లాలు నాలుగు పూల్స్‌లో తలపడుతుండగా గుంటూరు తొలి మ్యాచ్‌లో 8-0 గోల్స్ తేడాతో శ్రీకాకుళంపై, రెండో మ్యాచ్‌లో 2-1తో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించింది. విశాఖ జట్టు 5-0తో పశ్చిమగోదావరి జట్టుపై, కడప 7-0తో ప్రకాశం జట్టుపై గెలుపొందాయి. నెల్లూరు 1-1తో తూర్పుగోదావరి జట్టుతో మ్యాచ్ డ్రా చేసుకుంది. నెల్లూరు మరో మ్యాచ్‌లో 1-0తో విజయనగరం జట్టుపై, కర్నూలు 5-0తో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించాయి. రైల్వే స్టేడియంలో బుధవారం విశాఖ- పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్ కిక్ ఆఫ్ చేసి ప్రారంభించారు. ఇరుజట్ల క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ షేక్ పీర్‌వలి. S/o. నబి సాహెబ్ ద్వారా సమాచారము పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పల్నాడు జిల్లా, నరసరావుపేట టౌన్, రామిరెడ్డిపేటలోని ముంగర సత్య శ్రీనివాస ప్రసాద్ గారి కుమారుడు సాకేత రాంప్రసాద్ గారి స్వాధీనములో ఉన్న డోర్ నెం 11-11-8లో ఉన్న డాబా ఇల్లు, ఖాళీ స్థలం ఈ ఆస్తి లోగడ రిజిష్టరు పీలునామా ద్వారా సంక్రమించినది ఆస్తిని, నా క్లయింట్ విక్రయం పొందుటకు ఖరారు పడినాడు కావున సదరు ఆస్తిపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరణ ఉన్న ఎడల ఈ క్రింది చిరునామాకు పదిహేను రోజులలోపు తెలియజేయగలరు అట్లు లేని యెడల ఏ విధమైన అభ్యంతరాలు కానీ కోర్టు దాఖల కేసులు లేవని భావించి నా క్లయింట్ ఆస్తిలో సుమారు 10 సెంట్లు స్థలంను కొనుగోలు చేయుటకు ఇష్టపడి విక్రయం పొందుటకు ఖరారు పడినాడు. కావున సదరు ఆస్తిపై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరణ ఉన్న ఎడల ఈ క్రింది చిరునామాకు పదిహేను రోజులలోపు తెలియవరచగలరని యావన్మందికి తెలియచేయడమైనది.

కాసు వెంకట రెడ్డి, న్యాయవాది
ఫ్లాట్ నెం.304, అరండల్‌పేట, 14/3, గుంటూరు. సెల్ : 9346983822